# ఇంద్రధనుస్సు

టి. శ్రీవల్లీ రాధిక



# ఇంద్రధనుస్సు

(1999 లో ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురించబడిన నవల)

టి. శ్రీవల్లీ రాధిక

ప్రమథ ప్రచురణలు

హైదరాబాద్

# Indradhanussu…

Novel by **T. Srivalli Radhika**

© T. Srivalli Radhika

*e-book Edition* : 2013

*e-book Price* : Rs. 8**0/-**

Author’s email ID :

srivalliradhika@gmail.com

## నా రచనలని అభిమానించే పాఠకుల కోసం నాలుగు మాటలు

"నా రచనలని అభిమానించే పాఠకుల కోసం" అని ప్రత్యేకంగా ఎందుకు వ్రాస్తున్నానంటే.. మిగతావారంతా దీనిని ఒకసారి చదివి, బాగుందనుకునో బాలేదనుకునో ప్రక్కన పెట్టినా.. నా రచనలని అభిమానించే వాళ్ళకి మాత్రం కొన్ని ప్రశ్నలు తలెత్తుతాయనీ, అవి నన్ను అడగాలని అనుకుంటారనీ అనిపిస్తూండడం వలన.

ఆ సమాధానాలేవో నేను ముందే చెప్పేసి వాళ్ళ అభిమానాన్ని ఇంకొంచెం దోచుకుందామన్న ఆశ వలన.

అసలిది ఎప్పుడు వ్రాశారు? ఎందుకు వ్రాశారు? ఇన్నాళ్ళూ ఊరుకుని ఇపుడెందుకు ప్రచురించారు? మీరు క్లుప్తంగా వ్రాస్తారని తెలుసు కానీ ఇందులో అది ఇంకొంచెం అతి అయినట్లు లేదూ! – ఇలాంటి ప్రశ్నలు వస్తాయని అనిపించి ఈ నాలుగు మాటలూ వ్రాస్తున్నాను.

1999 లో "ఆంధ్రప్రభ దిన పత్రిక" వారు ఉమ్మడి కుటుంబాలని సమర్ధిస్తూ, కొన్ని వారాల పాటు ఏదైనా వ్రాయాలని అడిగినపుడు.. వారం వారం వ్రాసి యిచ్చిన నవల యిది. కేవలం ఉమ్మడి కుటుంబాలలో వుండే మంచి చెడులని విశ్లేషించడమే ఉద్దేశ్యంగా పదమూడు వారాల పాటు సాగిన శీర్షిక యిది.

ఇపుడు ఈ రచనని ఒకసారి చదివితే, పత్రికవారు అడిగితేనే వ్రాసినా.. అడిగిన విషయంపైనే వ్రాసినా... కొంత ప్రత్యేకంగానే వ్రాశాననీ, ఈనాటి పాఠకులు చదివి ఆనందించగల విషయాలు కొన్ని ఈ రచనలో ఉన్నాయనీ అనిపించింది.

అందుకే ఇన్నాళ్ళ తర్వాత దీనిని ఇ-బుక్ గా తెస్తున్నాను.

★★★

# 1

“మధ్యాహ్నం అమ్మ ఫోన్ చేసింది.” ఆఫీసు నుంచి వచ్చి, స్నానం చేసి సోఫాలో రిలాక్సవుతూ చెప్పాడు మాధవ్.

చదువుతున్న పేపర్లో నుంచి తలెత్తి చూసింది వసంత. “ఎందుకు!” అంది పెద్ద ఆసక్తి ధ్వనించని స్వరంతో.

“నిన్ను వచ్చి ఒక నెల రోజులు అక్కడ వుండమంది.”

“నన్నా!” అంది వసంత అర్ధం కానట్లు.

“ఊ. గీత వస్తుందిట డెలివరీకోసం. సహాయానికి రమ్మంటోంది.”

“ఏం చెప్పారు మరి!”

“నిన్ను అడిగి చెప్తానన్నాను.”

సంభాషణ అక్కడితో ఆగింది. వసంత పేపర్ మడిచి టీపాయ్ మీద పెట్టి వంటగదిలోకి నడిచింది. మాధవ్ టి.వి. లో లీనమయ్యాడు.

వంట చేస్తున్నంత సేపూ ఆలోచిస్తూనే వుంది వసంత. “ఎలా! ఇదో కొత్త సమస్య వచ్చిపడిందే!” అనిపించింది.

ఒకరోజో రెండ్రోజులో చుట్టంచూపుగా అత్తగారింటికి వెళ్ళడానికీ, సరదాగా గడపడానికీ అభ్యంతరం లేదామెకి.

కానీ నెలరోజులు! నెలరోజులు ఇల్లొదిలి పెట్టి అక్కడ వుండటమంటే ఎంత కష్టం! నెల అంటున్నారు కానీ తీరా వెళ్ళాక అది ఏ మూడు నెలలో కావచ్చు. పురుడు బహుశా యింకో పదిహేను రోజుల్లో వస్తుంది. అవసరమంతా ఆ తర్వాతే కదా!

అయినా తను వెళ్ళి మాత్రం ఏం సహాయం చేయగలుగుతుంది? తొమ్మిదయ్యేసరికి తనూ ఆఫీసుకి వెళ్ళాలి. మళ్ళీ సాయంత్రం ఆరూ ఆరున్నర కానిదే ఇల్లు చేరలేదు. అప్పుడంతా ఆవిడ చేసుకోవలసిందే కదా!

ఆలోచనలతోనే వంట ముగించి యివతలికి వచ్చింది వసంత. గోడమీది గడియారం ఎనిమిదిన్నర చూపిస్తోంది.

మాధవ్ యింకా టి.వి. చూస్తూనే వున్నాడు. ఉదయ్ కూడా వచ్చి తండ్రి పక్కన చేరడం గమనించి "ఏరా! హోం వర్క్ అయ్యిందా! లేదా!" అంది వసంత.

"చేసేశాను మమ్మీ" అన్నాడు వాడు టి.వి. మీద నుంచి కళ్ళు తిప్పకుండానే.

"అన్నం పెడతాను రా మరి."

"ఉండు. ఇది అయిపోయాక తింటాను."

తండ్రీ కొడుకులిద్దరూ అంత దీక్షగా చూస్తున్నదేమిటా అని టి.వి. వైపు దృష్టి సారించింది.

ఏదో ఇంగ్లీషు గోల. కేకలు.. బొబ్బలు.. రయ్యి రయ్యిన కార్లు రావటాలు ... పెద్ద పెద్ద బిల్డింగులు పేకమేడల్లా కూలిపోవటాలు... యిద్దరూ పరమ ఉత్కంఠగా చూస్తున్నారు

పేపర్ తీసుకుని బెడ్ రూం లోకి నడిచింది వసంత. మంచం మీద కూర్చుందో లేదో ఆవులింతలు మొదలయ్యాయి. త్వరగా అన్నం తినేసి త్వరగా పడుకుందామంటే ఏరోజూ కుదరదు.

టి.వి. వుంటే చాలు వాళ్ళకసలు ఒక పట్టాన అన్నం తిందామన్న ధ్యాసే రాదు. ఎపుడో విపరీతంగా ఆకలి వేసినపుడో .. విపరీతంగా నిద్ర వచ్చినపుడో 'అన్నం పెడ్తావా!' అని కేక పెడ్తారు.

తీరా వెళ్ళి అన్నం పెడితే అది తింటూన్నంత సేపూ కూడా టి.వి. గోలే. కనీసం ఒక కన్ను టి.వి. మీద, ఒక కన్ను అన్నం మీద పెట్టినా బాగానే వుంటుంది. కానీ అలా కూడా చేయరు. రెండు కళ్ళూ టి.వి. మీదే.

అన్నం పెట్టడం అనేది ఒక పెద్ద చిరాకు కార్యక్రమం అయిపోతుంది.

ఇవన్నీ అయి పడుకునేసరికి ఏ రోజూ పదకొండు పదకొండున్నర. అత్తగారింట్లో ఉన్న రోజుల్లో కూడా యింత ఆలస్యం అయ్యేది కాదు.

అక్కడ అత్తగారు, మామగారు, అప్పటికి యింకా పెళ్ళికాని ఆడపడుచు, యిద్దరు మరుదులు .. యింతమంది ఉన్నా పదయ్యేసరికి పడుకునేవారు తామిద్దరూ.

'పెళ్ళైన కొత్త కదా మరపుడు!' అనుకుంటే వసంత పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. 'ఒక పిల్లాడు పుట్టేసరికి ఈయనకి పెళ్ళాం మీద ధ్యాస కన్నా టి.వి. మీద ధ్యాస ఎక్కువయిపోయింది' అనిపించింది.

కానీ అసలు కారణం అది కూడా కాదు. అక్కడ వున్నపుడు మాధవ్ కి టి.వి. చూసే అవకాశం దొరికేది కాదు. మరుదులు యిద్దరూ అర్ధరాత్రి దాటే వరకూ వాళ్ళకి యిష్టమైన చానల్స్ ఏవో తిప్పుకుంటూ కూర్చునేవారు.

మిగతా విషయాలు ఎలా ఉన్నా టి.వి. విషయంలో మాత్రం మాధవ్ మాట నెగ్గేది కాదు.

"ఇపుడు ఆయన యిష్టం. రాత్రి తెల్లవార్లూ చూసినా అడిగేవాళ్ళు లేరు" అనుకుంది వసంత నిట్టూరుస్తూ.

ఇంకెవరి యిష్టాయిష్టాలతోనూ కోరికలతోనూ సంబధం లేదిక్కడ. వసంత అసలు సాధారణంగా టి.వి. చూడదు. ఎప్పుడో ఒకసారి ఏదో ఒక ప్రోగ్రాం మీద ఇంట్రస్ట్ చూపిస్తుంది. కానీ దాన్ని కూడా చూడనివ్వడు మాధవ్.

రెండు రోజుల క్రితం జరిగిన సంఘటన గుర్తొచ్చింది వసంతకి.

ఎనిమిది గంటలపుడు మాధవ్ ఏదో ప్రోగ్రాం చూస్తుంటే "ఏవండీ! ఒక్కసారి రిమోట్ యివ్వరా!" అంది వసంత వెళ్ళి.

"దేనికి!"

"మా కొలీగ్ కనిపిస్తుందటండీ. ఎలక్షన్స్ గురించీ, రాజకీయాల గురించీ వాళ్ళ కాలనీ వాళ్ళని ఇంటర్వ్యూ చేశారట, ఆ అమ్మాయి కూడా మాట్లాడిందట. అది చూద్దామని."

"ఏ చానల్ లో?"

"ఏదో చెప్పిందండీ. జెమినీనో, సిటీ కేబులో. చూస్తానుండండి. ఇటివ్వండి ఒకసారి దాన్ని." రిమోట్ కోసం చేయి చాపుతూ అడిగింది.

ఆమెకి అందకుండా చేయి వెనక్కి లాక్కుని తనే ఆ రెండు చానల్సూ మార్చాడు మాధవ్. అక్కడేవో అడ్వర్టైజ్ మెంట్స్ వస్తున్నాయి.

"ఎక్కడ! ఇక్కడేం రావట్లేదుగా!" అంటూ  మళ్ళీ తనకు కావలసిన చానల్ తిప్పుకుని చూడటంలో మునిగిపోయాడు.

మళ్ళీ అతనే పెడతాడేమోనని ఒక రెండు నిమిషాలు చూసింది వసంత. ఉహు. అసలా ధ్యాసే లేదు.

"ఏవండీ! చానల్ మార్చండీ. అడ్వర్టైజ్ మెంట్స్ అయిపోయి వుంటాయి." అంది.

"మారుస్తానుండు" అన్నాడు కానీ ఆ ప్రయత్నమేమీ చేయలేదతను.

"ఏవండీ" అంది మరో రెండు నిమిషాలకు అసహనంగా.

"ఊ." అతను చేయి ముందుకు సాచాడు చానల్ మార్చబోతున్న భంగిమలో. అంతే. బటన్ మాత్రం ప్రెస్ చేయలేదు.

వసంతకి ఒళ్ళు మండిపోయింది. జన్మకో శివరాత్రి అన్నట్లు సంవత్సరంలో ఒక్కరోజు ఒక్క పది నిమిషాలు తనక్కావలసిన చానల్ పెట్టుకోలేదా తను ఈ యింట్లో! అనిపించింది.

మాధవ్ మీద పడి రిమోట్ లాక్కోవాలనుకుంది కానీ మళ్ళీ "ఛీ. ఈ ప్రోగ్రాం చూడకపోతే చచ్చిపోతానా!" అనిపించింది. విసురుగా అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

అరగంట తర్వాత మాధవ్ చాలా మామూలుగా వచ్చి "వసంతా! అన్నం పెడతావా!" అని అడిగాడు.

అదంతా గుర్తొచ్చి వసంత మనసు మళ్ళీ చిరాకుగా మారింది.

"వెధవ టి.వి. ఒక పది నిమిషాలు తీరిగ్గా మాట్లాడుకోవడానికి కూడా అవకాశం లేదు." విసుక్కుంటూ యివతలికి వచ్చి "ఏవండీ! అన్నానికి వస్తున్నారా లేదా!" అని ఒక కేక పెట్టింది.

పరిస్థితి విషమించిందని అర్ధమయింది మాధవ్ కీ, ఉదయ్ కీ.

"పెట్టు" అన్నారు సోఫాలో నుంచి యిద్దరూ ఒకేసారి లేస్తూ.

భోజనం చేసి ఉదయ్ మళ్ళీ టి.వి. దగ్గరకి నడుస్తుంటే "ఇక చాలు. పడుకో." అంది వసంత కఠినంగా.

ఆ స్వరంలోని తీవ్రత అర్ధమయి మాధవ్ కూడా మాట్లాడకుండా బెడ్ రూం లోకి నడిచాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/kbook.php?id=1665](http://kinige.com/kbook.php?id=1665)**

* * *

**Read other books by T. Srivalli Radhika @**

**[http://kinige.com/kbrowse.php?via=author&name=T.+Srivalli+Radhika&id=154](http://kinige.com/kbrowse.php?via=author&name=T.+Srivalli+Radhika&id=154)**